ఆదివారం
ప్రజాశక్తి
సెప్టెంబర్ 1, 2002
అమెరికాను సైతం హడలెత్తించిన స్ఫూర్తితో
వియత్నాం పురోగమనం

హ్యాపీబర్త్‌డే

(1-9-2002 నుండి 7-9-2002 వరకు)



లూకేష్ ప్రసాద్
1సం॥, 1.9.2001
పండు-నారాయణ
ఉయ్యూరు



జి. ప్రణయ్ సాయి
2సం॥, 2.9.2000
కృష్ణవేణి-కామేశ్వరరావు
విజయవాడ



జి. కీర్తిరెడ్డి
2సం॥, 3.9.2000
లక్ష్మీభవాని-అప్పలరెడ్డి
విజయవాడ

షేక్ కరీముద్దీన్
1సం॥, 3.9.2001
అమీర్‌జాది-తాజుద్దీన్
కాకినాడ

మద్దిలేటి సుప్రియ
1సం॥, 3.9.2001
యశోద-ప్రభాకర్
రాయదుర్గం



చాట్ల సుభాషిణి (సుబ్బు)
1సం॥, 4.9.2001
నర్సమ్మ-సంజయ్‌మిత్ర
సీతానగరం

రామగని సాయికిరణ్
1సం॥, 4.9.2001
వాణి-శేషారావు
ఖమ్మం

షేక్ కరిష్మా
8సం॥, 4.9.1994
సుబాన్‌బీ-మస్తాన్ వలీ
పొనుగుపాడు

మమత
2సం॥, 5.9.2000
శ్యామల-రెడ్యా
అక్కారం

కె. శిరీష వైష్ణవి
4సం॥, 6.9.1998
మాధవి-రామకోటేశ్వరరావు

ఎస్. అఖిల
2సం॥, 7.9.2000
లావణ్య-కుమార్
మొయినాబాద్

...సుకుంటారా ?

సాధారణంగా జనరల్ ఎనస్థీషియా ఇస్తాము. చిన్న పిల్లలకు మత్తు ఇచ్చేటప్పుడు వాడే మందులన్నీ వారి బరువును బట్టి కచ్చితమైన మోతాదులో ఇస్తాము. ముఖ్యంగా ఆపరేషన్ జరిగేటప్పుడు పిల్లల శరీర ఉష్ణోగ్రత సరిగా ఉంచటం, రక్తం, సెలైను అవసరాన్ని బట్టి కచ్చితంగా ఇవ్వటం, ఇప్పుడు మనకు లభిస్తున్న తక్కువ సమయం పని చేసే మత్తు మందులు ఉపయోగించటం మొదలైన జాగ్రత్తలు తీసుకుంటాము.

కొత్తగా గ్యాస్ మత్తు అని ఎక్కువగా వింటున్నాం కదా. అసలు ఈ గ్యాస్ మత్తు అంటే ఏమిటి? దీని గురించి వివరాలు తెలియజేయండి ?

జనరల్ అనస్థీషియా ఇవ్వటానికి ఆక్సిజన్, నైట్రస్ ఆక్సైడ్ గ్యాస్ వాడతారు. అందువలన జనరల్ ఎనస్థీషియాని గ్యాస్ మత్తు అంటారు.

ఇప్పటికీ కొంతమంది క్లోరోఫారం మత్తు ఇస్తారా అని అడుగుతూ ఉంటారు కదా? అసలు ఈ క్లోరోఫారం మత్తు అంటే ఏమిటి? దీని గురించి వివరించండి ?

జనరల్ ఎనస్థీషియా ఇవ్వటానికి 1886లో మొదటిసారి క్లోరోఫారం ఉపయోగించారు. చాలా సినిమాలలో క్లోరోఫారం పోసిన చేతిరుమాలును ముఖంపై ఉంచి వ్యక్తులను స్పృహ తప్పించడం చూపిస్తుంటారు. అందువలన జనరల్ ఎనస్థీషియానే ప్రజలు క్లోరోఫారం అని భావిస్తుంటారు. క్లోరోఫారం వలన కాంప్లికేషన్స్ చాలా ఎక్కువ. అందువలన ఇప్పుడు వాడుకలో లేదు.

ఆపరేషన్ సమయంలో కొంతమందిలో మత్తు ఎక్కలేదు అంటుంటారు. ఇలా ఎందువలన జరుగుతుందో తెలియజేయండి ?

ఇది ఎక్కువగా స్పైనల్, లోకల్ ఎనస్థీషియాలో చూస్తుంటాము. మత్తు అంటే స్పృహ లేకుండా ఉండటం అనే అపోహ వలన పై మత్తు ఇవ్వబడిన రోగులు మాకు అంతా తెలిసింది. మాట్లాడుతూనే ఉన్నాము. అన్నీ వినపడుతున్నాయి. మత్తు సరిగా ఎక్కలేదు అని అనుకుంటారు.

ఆపరేషన్ సమయంలో ఇచ్చే మత్తు వలన ఏమైనా దుష్ఫలితాలు ఉంటాయా? వాటిని నివారించడానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఆపరేషన్ సమయంలో రోగి పూర్వపు స్థితి వలన కాని, ఎక్కువ రక్తస్రావం వలన కాని, కొన్నిసార్లు మత్తు మందులకు రోగి అతిగా స్పందించటం మొదలైన కారణాల వలన పేషెంటుకు బి.పి. తగ్గటం, ఆక్సిజన్ శరీర భాగాలకు సరిగా అందకపోవటంలాంటి ఇబ్బందులు కలుగవచ్చు. కాని ఈ రోజుల్లో చక్కని శిక్షణ పొంది, అనుభవం కలిగిన మత్తు డాక్టర్లు, ఆపరేషన్ థియేటర్‌లో వాడే ఇ.సి.జి. మానిటర్, పల్స్ ఆక్సీమీటర్ లాంటి ఆధునిక పరికరాలు, క్షణక్షణం అప్రమత్తతతో ఉండటం వలన 99.9 శాతం ఏ విధమైన దుష్ఫలితాలు లేకుండా ఆపరేషన్లు నిర్వహించగలుగుతాము.



నాకు నడుముకు మత్తు ఇచ్చారు అప్పటి నుండి నడుము నొప్పి వస్తోంది అని అనడం మనం ఇప్పటికీ వింటుంటాం. ఇది ఎంతవరకు నిజమంటారు ?

ఇది కేవలం అపోహ మాత్రమే. ఇప్పుడు మేము నడుము ఇంజక్షన్‌కు వెంట్రుకలాంటి చాలా సన్నని సూదులు వాడుతున్నాము. కనుక నడుము ఇంజక్షన్ తరువాత నడుము నొప్పి రాదు అని బల్లగుద్ది మరీ చెప్పవచ్చు. ఆపరేషన్‌కు ముందు నడుం నొప్పి ఉండటం, ఆపరేషన్ తరువాత ఎక్కువ కాలం రెస్ట్ తీసుకోవటం వలన కండరాల పటుత్వం తగ్గడం వలన, బరువు పెరగటం వలన, బాలింతలలో హార్మోన్ల ప్రభావం వలన, లిగమెంట్ల సడలింపు వలన నడుం నొప్పి వచ్చే అవకాశం ఉంది. బరువు తగ్గటం, నడక, వ్యాయామం చేయటం వలన నడుం నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు.

ఈ మధ్య కాలంలో ఎనస్థీషియా రంగంలో వచ్చిన ఇంప్రూవ్‌మెంట్స్ గురించి విపులంగా తెలియజేస్తారా ?

మంచి ఎనస్థీషియా మెషీన్లు, రకరకాల సేఫ్టీ అలారమ్స్ కలిగిన, పేషెంటు పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేసే ఆధునిక మానిటర్స్, తక్కువ సైడ్ ఎఫెక్ట్స్ కలిగిన మత్తు మందులు, సులభమైన, ఎఫెక్టివ్ టెక్నిక్స్, రోగి భద్రతకే పూర్తిగా అంకితమైన నిపుణులైన మత్తు డాక్టర్లు వంటివి ప్రస్తుతం ఉన్న ఇంప్రూవ్‌మెంట్స్.

ఆపరేషన్ సమయంలో మత్తు డాక్టర్‌గారి పాత్ర మత్తు ఇవ్వడం వరకేనా లేక ఆపరేషన్‌కు ముందు, తరువాత ఎంతవరకు ఉంటుంది ?

మత్తు డాక్టర్ గారి పాత్ర ఆపరేషన్ ముందు, జరిగేటప్పుడు, తరువాత సాధారణంగా 6-24 గంటల వరకు ఉంటుంది. ఆపరేషన్ ముందు పేషెంటును క్షుణ్ణంగా పరీక్షించటం, పేషెంటుకు ఇచ్చే ఎనస్థీషియా విధానం గురించి వివరించటం, పేషెంటు కంగారుపడకుండా ఆపరేషన్‌కు సిద్ధం చేయటం మత్తు డాక్టర్ల విధి. ఆపరేషన్ సమయంలో అప్రమత్తంగా ఉండి, పేషెంటు శారీరక స్థితిని సరిగా ఉంచటం, ఆపరేషన్ తరువాత మత్తు నుండి త్వరగా బయటకు తేవటం, నొప్పి తెలియకుండా చేయటం, పేషెంటును వార్డుకు మార్చగలిగే స్థితి వరకు కంటికి రెప్పలా కాపాడటం మత్తు డాక్టర్ల గురుతర బాధ్యత.

ఎనస్థీషియా విధానంలో వచ్చిన ఆధునికమైన మార్పులు సర్జరీ విభాగానికి ఎంతవరకు ఉపయోగపడుతున్నాయి ?

ఎనస్థీషియా రంగంలో వచ్చిన ఆధునికమైన మార్పులు పైన చెప్పాము. దీని కారణంగా బ్రెయిన్, వెన్నుపూస బైపాస్ సర్జరీ ఇతర గుండె చికిత్సలు, అవయవాల మార్పిడిలాంటి క్లిష్టతరమైన ఆపరేషన్లు నేడు చేయగలుగుతున్నారు.

ఎనస్థీషియా ఇవ్వటమే కాకుండా మత్తు డాక్టర్లు ఇంకా ఏమైనా చేస్తారా ?

ఆపరేషన్‌కు మత్తు ఇవ్వటమే కాకుండా మత్తు డాక్టర్లు చాలా పనులు చేస్తారు. (ఎ) ప్రపంచ వ్యాప్తంగా ఐసియులు చాలా వరకు మత్తు డాక్టర్ల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. (బి) ప్రాణాపాయ స్థితిలో కృత్రిమ శ్వాస కల్పించటం, గుండెను తిరిగి కొట్టుకొనేటట్లు చేయటం మత్తు డాక్టర్లకు వెన్నతో పెట్టిన విద్య. దీనినే కార్డియోపల్మోనరీ రీససిటేషన్ అంటాము. (సి) ఇతర దేశాలలో, మన దేశంలో చాలా చోట్ల మత్తు డాక్టర్లు రకరకాల నొప్పులకు పెయిన్ క్లినిక్స్ నిర్వహిస్తున్నారు. (డి) పురుగు మందులు, నిద్రమాత్రలు మింగిన వారిని కృత్రిమ శ్వాస పరికరములను ఉపయోగించి కాపాడటం, నొప్పిలేకుండా కాన్పు చేయడం.

ఎమర్జన్సీ పేషెంట్లను రక్షించటంలో మీ పాత్ర ఏమిటి ?

ఊపిరితిత్తులలోనికి ఎండోట్రేకియల్ ట్యూబ్ వేసి దాని ద్వారా అత్యవసర పరిస్థితులలో కృత్రిమ శ్వాస కల్పించి ఆక్సిజన్ అందించగల నైపుణ్యం మత్తు డాక్టర్ల ప్రత్యేకత. ఈ నైపుణ్యం వలన కింద ఉదహరించిన సందర్భాలలో రోగులకు కృత్రిమ శ్వాస కల్పించి బ్రతికించవచ్చు.

ఉదా : (1) యాక్సిడెంట్ వలన అధిక రక్తస్రావం జరిగి రోగి షాక్‌లో ఉన్నప్పుడు (2) తలకు బలంగా దెబ్బతగిలి మెదడు వాయుట, గాలి పీల్చుకోలేక పోతున్నప్పుడు (3) గుండెపోటు సమయంలో (4) అప్పుడే పుట్టిన బిడ్డ గాలి పీల్చలేక పోతున్నప్పుడు (5) పాయిజనింగ్ కేసులలో (6) పాముకాటు, తేలుకాటు మొదలగు వాటి వలన రోగి షాక్‌లో ఉన్నప్పుడు, (7) వేరే వ్యాధుల వలన ప్రాణాపాయం సంభవించినప్పుడు ఉదా: ఫాల్సీపేరమ్ మలేరియా. ✤

అంపశయ్య నవీన్

పుస్తకాల్ని కొని చదువుతారా ?

"ఎప్పుడు చూసినా రాస్తుంటారు కదా! ఈ రోజు ఏదో చదువుతున్నారేమిటి?" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"రాయటం.. చదవడం.. మీలాంటి స్నేహితులతో మాట్లాడటం... ఈ మూడూ నాకు చాలా ఇష్టమైన పనులు. సాధారణంగా ఉదయం తొమ్మిదింటి నుండి ఒంటిగంట వరకు రాస్తుంటాను - ఆ తర్వాత భోజనం చేసి కాసేపు పడుకుంటాను - నాల్గింటి నుండి చదివే కార్యక్రమం మొదలవుతుంది - ఈ రోజు ఉదయమే ఈ పుస్తకం చదవడం మొదలెట్టాను - నిజానికి ఈ పుస్తకాన్ని నిన్న సాయంత్రం మొదలెట్టాను. ఎంత బావుందంటే దీన్ని పూర్తి చెయ్యకుండా వదిలిపెట్టలేనంత బావుంది. అందుకే దీన్ని పూర్తి చెయ్యాలని ఈ ఉదయం రాసే కార్యక్రమాన్ని పక్కన పెట్టి చదవడం మొదలెట్టాను" అన్నాను.

"అంత బావున్న పుస్తకం ఏమిటో?" అంటూ నా చేతుల్లో ఉన్న పుస్తకాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు పుల్లారావు.

"అది "ది హౌజాఫ్ బ్లూ మాంగోస్" అని ఓ నవల - "డేవిడ్ దావిడర్" అనే ఆయన రాశాదు - ఇటీవలనే వెలువడింది" అన్నాన్నేను.

"ఇంతలావు పుస్తకం... నాలుగు వందల పేజీలకు పైనే ఉంది... ఇంత పెద్ద పుస్తకాన్ని చదవడానికి మీకెన్ని రోజులు పడ్తుందో?..." అన్నాడాయన ఆ పుస్తకాన్ని అటూ ఇటూ తిప్పుతూ.

"వదలకుండా చదివితే మూడు నాలుగు రోజుల్లో పూర్తి చెయ్యొచ్చు..."

"ఇంత పెద్ద పుస్తకాన్ని మూడు నాలుగు రోజుల్లో పూర్తి చేస్తారా? నేనైతే నెల రోజుల్లో కూడా పూర్తి చెయ్యలేను - ఎప్పుడో చదువుకునే రోజుల్లో టెక్స్ట్‌బుక్స్ తప్ప నేనింత వరకూ కనీసం ఒక్క పుస్తకాన్ని కూడా పూర్తిగా చదవలేదు. నాలుగైదు పేజీలు చదవగానే ఆవులింతలొచ్చేస్తాయి. నిద్రపోవాలనిపిస్తుంది - అది సరేగానీ, మీకింతింతపెద్ద పుస్తకాలు ఎక్కణ్ణించి వస్తాయి?"

"ఎక్కణ్ణించి రావడమేమిటి? బుక్‌షాప్స్‌కు వెళ్ళి కొనుక్కుంటాను - కొన్ని పుస్తకాల్ని పోస్టు ద్వారా తెప్పించుకుంటాను. ఈ పుస్తకాన్ని నేను పోస్టు ద్వారానే తెప్పించుకున్నాను."

"ఎంతయిందేమిటి?"

"పోస్టు ఖర్చులతో కలిసి నాలుగు వందలకు పైనే అయ్యింది"

"ఒక్కసారి చదివి అవతల పారేసే ఓ పుస్తకం మీద మీరు నాలుగు వందలు ఖర్చు పెట్టారా? ఎంత దారుణం! ఎంత దారుణం! మీకొచ్చే డబ్బంతా పుస్తకాల మీదనే తగలేస్తున్నట్టుందే!"

"పుస్తకాల్ని కొని చదవడం మీకింత దారుణంగా కనిపిస్తున్నదా? మీకే కాదు.. ఈ దేశంలో చాలా మందికి పుస్తకాల్ని కొనడం వృధా ఖర్చే అనిపిస్తుంది. దురదృష్టం ఏమిటంటే పుస్తకాలు కొని చదవడం అన్నది మన సంస్కృతిలో ఒక భాగం కాకపోవడం... పొద్దున లేచినప్పట్నించి మీరు ఎన్ని వస్తువుల మీద ఖర్చు పెడ్తున్నారూ? టూత్‌పేస్ట్, సోప్స్, టీ, కాఫీ, కూరగాయలు, బియ్యం, ఉప్పు, పప్పు.. ఇవన్నీ పోగా దుస్తుల మీద ఎంత ఖర్చు పెడ్తున్నారు? మీ ఆవిడ చీరల మీద ఎంత ఖర్చు పెడ్తున్నది? ప్రతి రెండు నెలల కొకసారి టెలిఫోన్ బిల్లు మీద ఎంత ఖర్చు పెడుతున్నారు? కరెంట్ బిల్ మీద ఎంత ఖర్చు పెడుతున్నారు? మీ కారులో ప్రతినెలా ఎన్ని వందల రూపాయల పెట్రోల్ పోయిస్తున్నారు? ఇవన్నీ మీకెలాంటి అవసరాలో పుస్తకాలు నాకలాంటి అవసరమే! పుస్తకమంటే ఓసారి చదివి అవతల పారేసేదని మీరనుకుంటున్నారు... కానీ నేనలా అనుకోవడం లేదు.... ఓ మంచి పుస్తకాన్ని ఒకసారి కాదు.. ఎన్నోసార్లు చదువుతాం... దాన్నుంచి ఎంతో నేర్చుకుంటాం. ఓ మంచి పుస్తకం చదవడం అనేదొక గొప్ప అనుభవం.. బాగా చదువుకున్న మీలాంటి వాళ్ళు మంచి పుస్తకాలు చదవకపోవడం వల్ల ఎంత కోల్పోతున్నారో ఆలోచిస్తే చాలా బాధ కలుగుతుంది"

"పుస్తకాల్ని కొని చదవడం అవసరమంటారా? లైబ్రరీలుంటాయి కదా.. లైబ్రరీల నుండి తెచ్చుకోవచ్చు కదా.. లేకపోతే పుస్తకాలు కొనే పిచ్చి ఉన్న వాళ్ళ దగ్గర్నుంచి అడుక్కొని చదవొచ్చు కదా..."



"మన దేశంలో లైబ్రరీలు చాలా అధ్వానంగా ఉంటాయి. ఎక్కడో పెద్ద సిటీల్లో ఉండే కొన్ని లైబ్రరీలు తప్ప, మన డిస్ట్రిక్ట్ సెంటర్సులో ఉండే లైబ్రరీల్లో లేటెస్ట్ బుక్స్ ఉండనే ఉండవు. ఆరేడేళ్ళ నుంచి మన ప్రభుత్వం వారు జిల్లా గ్రంథాలయాలకు పుస్తకాలు కొనడానికి గ్రాంటులివ్వడం బాగా తగ్గించారు. పుస్తకాలు చదివి ప్రజలెక్కడ విజ్ఞానవంతులైపోతారోనని ప్రభుత్వం భయం! అందుకే లైబ్రరీలు మూసేసే పరిస్థితిని సృష్టిస్తున్నారు.. అందుకే కొత్తగా వచ్చే ఏ పుస్తకమైనా మన లైబ్రరీస్‌లో దొరకదు.... అందుకని కొన్ని పుస్తకాల్నైనా మనలాంటి మిడిల్ క్లాస్, అప్పర్ మిడిల్ క్లాసు వాళ్ళం కొనుక్కొని చదవాలి. పుస్తకాలు కొనే పిచ్చి ఉన్న వాళ్ళ దగ్గర్నుంచి అడుక్కొని చదవొచ్చు కదా అని మీరన్నారు.. పక్కవాళ్ళ దగ్గర్నుంచి "అడుక్కోవడం" అనేది మన సంస్కృతిలో ఒక భాగమై పోయిందేమోననిపిస్తుంది. మామూలుగా అయితే ఈ అడుక్కోవడం అనేది ఎంత అవమానకరమో అందరికీ తెలిసిందే. అన్నం అడుక్కునే వాణ్ణి మనం ఎలా చూస్తాం? పైసలడుక్కునే వాణ్ణి ఎలా చూస్తాం? మన పక్కవాడి దగ్గర్నుంచి న్యూస్ పేపర్ అడుక్కోవడం కూడా అలాంటిదేనని ఎందుకనుకోరు? మనం ట్రెయిన్లోనో, బస్సులోనో ప్రయాణం చేస్తున్నప్పుడు మామూలుగా కనిపించే దృశ్యమేమిటి? ఎవరో ఒకరు ఆ రోజు న్యూస్‌పేపర్ కొంటారు - దాన్ని ఆ కొన్న వాడు చదవక ముందే బస్సులో కూర్చున్న వాళ్ళందరూ చదివేస్తారు. ఆ న్యూస్‌పేపర్ ఆ బస్సంతా తిరిగొస్తుంది - బస్సులో ప్రయాణం చేస్తున్న వాళ్ళకు ఓ న్యూస్ పేపర్‌ను స్వయంగా కొనుక్కునే ఆర్థిక స్తోమత లేదంటారా? ఇవ్వాళ్ళ న్యూస్‌పేపర్స్ ధరలు ఎంతగా తగ్గిపోయాయో మీకు తెలుసు కదా... ఇంగ్లీషు పేపర్ అయితే ఓ రూపాయి పెడితే వస్తున్నది... తెలుగు పేపర్లయితే రెండు రూపాయల ఎనభై పైసలు. పేపర్ కోసం ఈ మాత్రం ఖర్చు పెట్ట లేరా. పేపర్ చదవాలన్న ఉబలాటం ఉన్న వాళ్ళందరూ పేపర్ కొనుక్కొని చదవాలి... పక్కవాడి దగ్గర బిచ్చమెత్తడమేమిటి? పుస్తకాల విషయం కూడా అంతే... మన కిష్టమైన పుస్తకాల్ని మనమే కొనుక్కోవాలి... ఇతర దేశాలకు, మన దేశానికి ఈ విషయంలో చాలా తేడా కనిపిస్తుంది. న్యూస్‌పేపర్‌ని పక్కవాడి దగ్గర్నుంచి అడుక్కోవడాన్ని ఇతర దేశాల్లో చాలా అవమానకరమైన విషయంగా పరిగణిస్తారు. అక్కడ ప్రతి ఒక్కరూ పేపర్ కొనుక్కొని చదువుతారు.. అలాగే పుస్తకాలు కొనుక్కోవడమనేది ఇతర దేశాల్లో... ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల్లోని సంస్కృతిలో ఒక ప్రధాన భాగంగా మారిపోయింది. ఈ వ్యత్యాసం పుస్తకాల అమ్మకాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. మన దేశంలో ఇంగ్లీషులో ఓ కొత్త పుస్తకం వచ్చిందంటే ఓ పది, పదిహేను వేల కాపీలు సులభంగా అమ్ముడుపోతాయి. అదే ఓ తెలుగు పుస్తకమయితే..ఓ ఐదారు వేల కాపీలు కూడా అమ్ముడు పోవడం లేదు. ప్రభుత్వం గ్రాంటు లివ్వడం లేదు కాబట్టి లైబ్రరీలు పుస్తకాలు కొనడం లేదు. డబ్బు పెట్టి పుస్తకాలు కొనడం దండుగ అనుకునే సంస్కృతి మనది. ముఖ్యంగా మన తెలుగు వాళ్ళ సంస్కృతి అది. అలాంటప్పుడు పుస్తకాల్ని ఎవరు కొంటారు? పుస్తకాల్ని ప్రచురించే ప్రచురణ సంస్థలు ఎలా బతకాలి? పుస్తకాల్ని రాసే రచయితలెలా బతకాలి? ఇవ్వాళ్ళ పరిస్థితి ఎంతగా దిగజారిందంటే ప్రచురణ సంస్థలన్నీ మూతబడి పోతున్నాయి. మూతబడకుండా మిగిలిన సంస్థలు కూడా ఎక్కువ పుస్తకాల్ని ప్రచురించడం లేదు. అందుకని రచయితలే నానా తంటాలు పడి తమ పుస్తకాల్ని తామే ప్రచురించుకొని ప్రచురణ సంస్థలకు డిస్ట్రిబ్యూషన్ కోసం ఇస్తున్నారు. పుస్తకాల్ని కొనగలిగిన సామాన్య పాఠకులు పుస్తకాల్ని కొని చదవడం దండగ అనుకున్నంత కాలం, అడుక్కొని చదువుదాం అనే సంస్కృతి కొనసాగినంత కాలం పుస్తక పరిశ్రమ అభివృద్ధి చెందదు.... మంచి పుస్తకాలూ, మంచి రచయితలూ ఒక జాతి అంతరాత్మ ల్లాంటి వాళ్ళు - సమాజంలో మంచిని పెంచడానికి, ప్రజల్ని సంస్కారవంతుల్ని చెయ్యడానికి, చైతన్యవంతుల్ని చెయ్యడానికి పుస్తకాల్ని మించి సాధనం మరొకటి లేదు. పుస్తకాలు కూడా నిత్య జీవితావసరాల్లో ఒకటిగా మారాలి. పుస్తకాల్ని కొని చదవడం మన సంస్కృతిలో ఒక భాగం కావాలి. ఇవ్వాళ్ళ కేరళలోను, బెంగాల్‌లోనూ ప్రజల్లో పుస్తకాల్ని కొని చదివే సంస్కృతి ఏర్పడింది. అలాంటి సంస్కృతి మన తెలుగువాళ్ళల్లో కూడా ఏర్పడాలి. అప్పుడే మంచి రచయితలూ, మంచి పుస్తకాలూ మనకు 'అందుబాటులో ఉంటాయి" అన్నాన్నేను. ✤

కలంస్నేహం

పేరు : కె. సమత
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : ఆటలు, పాటలు, చదువుకోవడం
పూర్తి చిరునామా : డాటరాఫ్ కె. గద్దెన్న, ఇ.నెం : 1-1-6/జి, జవహర్‌నగర్ స్ట్రీట్ నెం: 10, హైదరాబాద్

పేరు : సిహెచ్. ధరణిచౌదరి
వయసు : 4 సం॥
చదువు : ఎల్‌కెజీ
హాబీలు : పెద్దలను అనుకరించుట
పూర్తి చిరునామా : డాటరాఫ్ సిహెచ్. సత్యనారాయణ, సెయింట్ ఆన్స్ స్కూల్ ఎదురు, భద్రాచలం, ఖమ్మం జిల్లా-507111

స్వప్న వేళ

అందని దాని కోసం ఆరాటపడనులే
అందినదానిని వదిలిపోనులే
ప్రేమించేవారిని ద్వేషించబోనులే
ఎల్లలు ఎరగని ఈ సంతోషం సొంతమయ్యేలా
ఇంద్రధనస్సునే తలపాగ చేసి
నాగలితో నడిచొచ్చిన వేళ
వెనువెంటనే వర్షం నాకు తోడు రాగా
బీడు భూమే బంజరయ్యేలే
చిగురించు స్వప్నంలో
చిరునగవులు చిందులు వేసేను
తుపాను, వరద పరిచయం లేని
ఈ భూమాతే నా నేస్తం
శేషరాజే కాపరై
మూషికుడిని వెంటబడి తరుముచుండెలే
పచ్చని నా పైరు పిచుకల పాలుకాకుండా
యమభటులే దిష్టిబొమ్మలై నిలిచారు
పంట ఏపును చూసి రవిరాజు కూడా చల్లబడ్డాడు
లేవకు రైతన్నా..ఇదంతా కల అని తెలితే కలవరపడతావు

-పెండెం ఫణి

మీకు తెలుసా!

1. బయాలజీ అన్న పదం 'గ్రీకు' భాషకు చెందినది.
2. విమానాల తయారీకి 'అల్యూమినియం' ఉపయోగిస్తారు.
3. కాఫీ పంటకు పర్వత నేలలు అనుకూలంగా ఉంటాయి.
4. ఝరియా బొగ్గు గనులు బీహార్ రాష్ట్రంలో కలవు.
5. స్కూటర్లు లక్నోలో అధికంగా తయారవుతాయి.
6. సిమెంట్‌ను తమిళనాడు అధికంగా ఉత్పత్తి చేస్తుంది.
7. కోల్ ఇండియా లిమిటెడ్‌ను 1975లో స్థాపించారు.
8. ద్రావిడుల ప్రధాన వృత్తి వ్యవసాయం.
9. సింధు ప్రజల ముఖ్య ఆహారం గోధుమ.
10. బయాలజీ అన్న పదాన్ని 'జీన్ లే మార్క్' అనే ఫ్రెంచి శాస్త్రవేత్త ప్రవేశపెట్టాడు.

సేకరణ : **ఇస్మాయిల్**, రాహుల్ స్కూల్, చీరాల, ప్రకాశం జిల్లా.

చిన్నారి చిత్రకారులు

జి. సురేష్, 2వ తరగతి
ఎస్‌విఎస్‌నికేతన్, చినకాకాని

బి. హరిణి, 7వ తరగతి
రామగిరి హైస్కూల్, నల్గొండ

కె. గుర్వారెడ్డి, 5వ తరగతి
కోదాడ పబ్లిక్ స్కూల్, కోదాడ

వీరార్పు రాజు, 9వ తరగతి
జడ్‌పిహైస్కూల్, పాలవలస

దొంగ.. దొంగంగే.. దొందొంగంగంగ..

రుక్మిణి

ఆ దినం రావిచెట్టూ.. రచ్చబండ చప్టా... దగ్గర్లోని గుడీ.. దాని అరుగులూ... జనమే జనం... చెట్టు మీద కాకులు కళవళ పడిపోతుంటే జనం కకావికలై గగ్గోలు పడుతున్నారు - ఊరుమొత్తం పిల్లా పితుకూ, ముసలీ ముతకా.. ఆడా మగా... సమస్త జనం చోద్యం చూద్దానికీ... వినడానికీ మహా ఆత్ర పడిపోతున్నారు.

అబ్బో -

చప్టామీద సర్పంచుగారు కండ్లు సగం మూసి తెరుస్తూ... పెదాల మీద వంకర నవ్వులు కురిపిస్తూ... అందర్నీ ఓరగంట నక్క చూపులు చూస్తున్నాడు గదా... మరో పక్క టీకుటాకుగా ఆయన పార్టీ వార్డు మెంబర్లు గుంటనక్కల నవ్వులు నవ్వుతూ మహా షసందైన పలుకులు పలుకుతున్నారు - ఇంకోపక్క కొంతమంది ప్రతిపక్షం వార్డు మెంబర్లు మహమంటగా జబ్బలు చరుస్తూ మండిపడిపోతున్నారు - తొడలు చరుస్తున్నారు -'ఇవాళ అటో ఇటో తేలిపోవాలని' రంకెలేస్తున్నారు.

ఇంతకీ అసలు సంగతేమిటంటే -

ఆ ఊరి గుడికింద సుమారు వేయి ఎకరాల దాకా భూమి ఉంది - గుడికో పూజారి నామమాత్రంగా ఉన్నాడు. అయితే ప్రస్తుతం గుడికి ఎకరం భూమి కూడా లేదు-అది అంతే! అట్లా వాటిని స్వంత కౌలుకోసం... కొంతలాభం కోసం అందరూ ఎగబడినారు - చిత్రమేమిటంటే ఆ భూముల చిట్టా లెక్కల సంగతి పూజారికర్థాదు గదా... ఆ గర్భగుడిలోని దేవుడికి కూడా తెలవదు మరి!

"ప్రజలారా.. బాగా వినండి... మన గుడితాలూకు మాన్యం విచ్చలవిడిగా ఈ అధికారంలో ఉన్న వాండ్లందరూ.. తమ బంధువులకూ... అయిన వాళ్ళకూ 'లీజు'లకిచ్చుకున్నారు. కాని వాండ్ల దగ్గర్నుండి లచ్చులు... లచ్చులు దండుకున్నారు. దారుణంగా దోచుకుతింటున్నారు-అందుకనే ఈ సభలో అడిగేది - నిలవేసేది - వీటన్నింటికీ తగిన సాక్ష్యాలున్నై..!"

ప్రతిపక్షం నాయకుడు రంకె అలా వేయడంతో సభంతా ఒక్కసారే నిశ్శబ్దం అలుముకుంది - చప్టామీద సర్పంచు మొహంలో రంగులు మారి వంకర నవ్వులు ఎటో ఎగిరిపోయాయి - వార్డు మెంబర్లు నోర్లు బార్లా తెరిచి మొహాలు కమిలిపోయి దిక్కులు చూడసాగారు - ఒకరిద్దరు ఒకరి చెవి ఒకరు అందినంత వరకూ కొరుక్కుంటున్నారు గదా!

జనంలో కలకలం మొదలయింది - పాపం... ఇట్లాంటి భాగోతం వాళ్ళు చూడలేదు గదా... విందానిక్కూడా తీరకుండదాయె! ఎవడి డొక్క తెరువు కోసం వాడు నానా హైరానా పడిపోతున్నపుడు ఇటు గుడి గురించీ.. పూజారి గురించీ.. లోపల దేవుడి గురించీ పట్టించుకునే తీరికెక్కడిదీ?

"వార్డు నెంబరు 5 సర్వే నెంబరు 116లో తన సొంత బామ్మర్దికి యాభై ఎకరాల గుడిమాన్యం గుంభనంగా కట్టబెట్టాడు - ఆడు దున్నుకుంటండు"

"ఇంగ వార్డు రెండుగారు వందెకరాలు తన పెండ్లాంగారి అక్కగారి అల్లుడిగారి పేర్న నూకి పారేసిండు - ఆడేమో అప్పనంగా బొప్పాయి తోటేసుకుని లొట్టలేస్తండు!"

"వార్డు నాలుగు గారు అబ్బో పది సర్వే నెంబర్లలో పదిహేను మందికి చడామడా గుడి భూములు రాయింపిచ్చిండు - అటు సుట్ట పక్కాలకే కాకుండా సుట్టు పక్కల జనాల దగ్గర లచ్చులు... లచ్చులు... అబ్బో... లెక్కలేయడం నా చాతకాదు - అందినవాడ్ని అందుకొనీ... అందనివాడ్ని అందులో నూకిండు!

"ఉపసర్పంచుగారు వందొంద ఎకరాల చొప్పున... ఎకరానికింతనీ... టోకున అంతనీ... కోటిదనక పట్టిచ్చిండు... ఇంగ కానీండ్రి... సర్పంచు గారూ... మీరు ఎలక్షన్లపుడు ఏంచెప్పి గెలిచినవ్...

నీది స్వచ్ఛమైన పాలవంటి పార్టీగదా... మీ తీరూ - తరీఖా వేరు గదా! ఈ ఒక్కసారి ఛాన్సిచ్చి చెంపలేసుకోమంటివి గదా... చెప్పు...

ప్రతిపక్షం మెంబర్లు హోరుకు తగులుకున్నారు - సర్పంచిగారు బిక్కజచ్చి పంచెసర్దుకున్నాడు - ఈలోపున ప్రతిపక్షం వాళ్ళు ఈ మొత్తం వ్యవహారంలో ఉపసర్పంచి మరీ మేకులాంటోడూ... యాడేసి తిప్పినా గిరగిరా తిరిగే రకవూ అందుకే ఆడు వెంటనే రాజీనామా ఇచ్చి పారేయాల్సిందేనని ఒకటేగోల!

ఓసారి సర్పంచి మోకాలి చిప్పల్ని సర్దుకుని నెమ్మదిగా లేచి నిలబడి దిక్కులు చూశాడు - వెంటనే చిన్న గొంతుకతో 'గుడిమాన్యం భూవులు గత మూడేండ్ల నుండీ జరిగిన అమ్మకాలు... లీజులు.. అన్నీ రద్దు.. కాన్సిల్" అని చెప్పి కూలబడ్డాడు.

"రద్దు సంగతి సరే మగడా... లచ్చులు కోట్లు దొబ్బిన కుంభకోణం రద్దవగానే లంబకోణం కాదూ... ఉపసర్పంచి రాజీనామా పెట్టాలె!" ప్రతిపక్షం వీరయ్య రంకెలేశాడు. సర్పంచిగారు ససేమిరా కుదరదంటాడు. "అక్రమాలు జరిగినాయంటున్నారు.. నేను సక్రమంగా రద్దు చేసిన గద... మరింకేంది?" అని ఆయనగారు ఆ మాట ముగించేసరికి 'వేలు లచ్చులు పోసి చేతులు తడిపిన కబ్జాదారులు.. లీజు వీరులు ఒక మూల నుండి లబలబ శాపనార్థాలకు తగులుకున్నారు.

"మాది అత్యంత స్వచ్ఛమైన పాలవంటి ప్రభుత్వం - చూశారా... మారూటే వేరు - అవినీతి జరిగింది - అనంగానే రద్దు చేసి పారేశాం... ఇన్ని దమ్ములున్నై? మా అవినీతినీ... లంచగొండి తనాన్నీ మేమే గుర్తించి రద్దు చేసి పారేశాం!"

"అందుకే రాజీనామా చేయాలంటున్నాం...!" ప్రతిపక్షం పెడబొబ్బలకు తగులుకోవడంతో సర్పంచు - మెంబర్లు కాసేపు బిత్తరపోయారు.

వెంటనే -

"అదీ... అయ్యా ప్రతిపక్షం వాండ్లూ... మీ తాత కూడా అవినీతి చేసిండు... అదుగో వాళ్ళ చిన్నాయన లంచం తిన్నాడు - మీరధికారంలో ఉన్నపుడు ఇంతకన్నా ఎక్కువ భాగోతాలు నడిపిన వాండ్లే ... మీ సంగతేంటీ.. మీ తాతలూ... బావలూ.. బంధువులూ అంతా అవినీతి పరులే! ఇపుడు మేం చేసినామనుకో... దానికి మీరింత అల్లరి చేయాల్నా?" అని సర్పంచి, మెంబర్లు ఎదురు దాడికి దిగారు.

జనం గోలకు తగులుకున్నారు -

యాద్గిరి జక్కులోడ్ని పక్కకు పిలిచి బీడీ వెలిగించాడు "అదేరా... ఢిల్లీలో కూడా ఈ ఎన్డీయే మహానుభావులు పెట్రోలు బంకులూ... గాసు డీలర్లు... కిరోసిన్ కోటాలు వాటా తీసుకుని కోట్లు కోట్లు మెక్కారు. రాంనాయక్ రాజీనామా చేయాలంటే మొండికేసి మిటకరిస్తున్నారు - అంతకుముందు కాంగ్రెస్ వాండ్లు అవినీతి చేసినారని ఎదురు దాడి... అసలు ఆగండ్రా!" యాద్గిరి రెచ్చిపోయి ప్రళయంగా కేకలు పెట్టాడు - "ఓర్నీ.. అసలు మీరందరూ దొంగలే గాదుర. చెవుల పూలు పెట్టుకున్నది మేమే జనాలని అనుకుంటున్నరు. వాడోదొంగ.. నువ్వో దొంగ... మీరూ - మీరూ కలిసి దేశాన్ని దోచుకుతింటుంటే మీ కీచులాటలు వింటానికేనా మేముంది - తాట వలిచే రోజు పూరాగా తోలు వలుస్తాం... జాగ్రత్త!"

ఉన్నత శిఖరం వైపు సచిన్ పరుగు

హసన్ షరీఫ్



మాస్టర్ బ్లాస్టర్ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్ క్రికెట్‌లో క్రమక్రమంగా ఎవరూ అందుకోలేనంత ఎత్తుకు ఎదుగుతున్నాడు. 1989-90వ సంవత్సరంలో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టగానే రికార్డుల పర్వం ప్రారంభించిన సచిన్ (తొలి టెస్ట్‌మ్యాచ్ ఆడిన అతిపిన్న వయస్కుడైన క్రికెటర్) ప్రతి ఇన్నింగ్స్ ఏదో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. దాయాది పాకిస్తాన్‌తో కరాచీలో జరిగిన టెస్ట్‌తో అతను అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగిడాడు. అప్పటినుండీ ప్రత్యర్థి ఆటగాళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తూ పరుగుల వరద పారిస్తున్నాడు. భారత జట్టులో సచిన్‌ను అవుట్ చేస్తే తాము గెలిచినట్లేనని అన్ని జట్లూ భావిస్తున్నాయంటేనే అతను ఎంత ప్రతిభావంతుడో తెలుస్తోంది. సచిన్‌ను కట్టడి చేయడానికి ప్రత్యర్థి జట్లు ప్రత్యేకంగా కసరత్తు చేసి ప్రణాళికలు రూపొందించాయి కూడా.

తాజాగా సచిన్ మరో రికార్డు అధిగమించాడు. ఈసారి అతను అధిగమించింది అనామక ఆటగాళ్లు నెలకొల్పిన రికార్డును కాదు. ఆధునిక క్రికెట్ పితామహుడు, ఎవర్ గ్రీన్ హీరోగా అందరి నుండీ ప్రశంసలు అందుకున్న సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ రికార్డును అధిగమించడం విశేషం. అందుకే ఈ రికార్డుకు ప్రత్యేకత ఉంది. ప్రముఖ క్రికెటర్లు తమ క్రీడా జీవితంలో కూడా సాధించలేని రికార్డును 29 ఏళ్ల వయస్సులోనే సాధించిన సచిన్ అతి త్వరలో ఎవరూ అందుకోలేనంత ఎత్తుకు ఎదుగుతాడనడంలో సందేహం లేదు. ఇంగ్లండ్‌లోని లీడ్స్ మైదానంలో 23వ తేదీన ఈ ఘనకార్యం సాధించినప్పుడు సచిన్‌ను అభిమానులు ప్రశంసలతో ముంచెత్తారు. కానీ సచిన్ మాత్రం ప్రశాంత వదనంతో తాను సాధించాల్సిన రికార్డులు ఇంకా చాలా ఉన్నాయన్నట్లు కనిపించాడు. ప్రతీ క్రికెటర్ తన జీవిత కాలంలో బ్రాడ్‌మన్ రికార్డును అధిగమించడమే ఘనంగా భావిస్తాడు. కానీ ఇతర రికార్డుల్లో ఇది కూడా ఒక భాగమని సచిన్ ప్రకటించడం అతని ఔన్నత్యానికి నిదర్శనం.

బ్రాడ్‌మన్ కంటే సచిన్ గొప్పవాడు : గవాస్కర్

సచిన్ టెండూల్కర్ అభివృద్ధికి అనునిత్యం వెన్నుతట్టి ప్రోత్సహించే లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ ఈ రికార్డుపై చాలా ఆనందం వ్యక్తం చేశాడు. బ్రాడ్‌మన్ కంటే సచిన్ గొప్ప ఆటగాడు అని గవాస్కర్ కితాబిచ్చాడు. బ్రాడ్‌మన్ నెలకొల్పిన రికార్డులన్నిటికీ దగ్గరగా ఉన్న సచిన్ ఇప్పుడు అత్యధిక సెంచరీల రికార్డును అధిగమించడం అతని గొప్పతనానికి నిదర్శనం అని గవాస్కర్ పేర్కొన్నాడు. కానీ తాను బ్రాడ్‌మన్ కంటే గొప్ప క్రికెటర్‌ను కాదని ప్రకటించడం సచిన్ హుందాతనానికి నిదర్శనం. బ్రాడ్‌మన్ ప్రతి మూడు ఇన్నింగ్స్‌లలో ఒక సెంచరీ ఉందని, అది ప్రస్తుత క్రికెటర్ల ఊహకు కూడా అందని రికార్డు అని సచిన్ అన్నాడు. ఇక సచిన్‌కు గవాస్కర్ రికార్డును బ్రేక్ చేయడమే మిగిలివుంది. అత్యధిక సెంచరీల రికార్డు ప్రస్తుతం గవాస్కర్ (34 సెంచరీలు) పేరున ఉంది. ఆ రికార్డును అధిగమించడం (మరో ఐదు సెంచరీలు చేయాలి) సచిన్‌కు సాధ్యమే. 29 ఏళ్ల సచిన్‌కు ఇంకా కనీసం ఆరేడేళ్ల క్రీడా జీవితం మిగిలివుంది.

సచిన్‌కూ తప్పని విమర్శలు

ప్రపంచంలో ఉత్తమ బ్యాట్స్‌మన్ సచిన్ అనే విషయాన్ని క్రికెట్ అభిమానులు ముక్త కంఠంతో ఒప్పుకోక తప్పదు. ఇదే సమయంలో అతను కూడా విమర్శకుల నుండి తప్పించుకోలేకపోతున్నాడు. 'సచిన్ జట్టు గెలుపు కోసం ప్రయత్నించడు. అతను ఎప్పుడూ వ్యక్తిగత రికార్డులు నెలకొల్పడంపైనే దృష్టి కేంద్రీకరిస్తాడు. భారత్ కష్టాల్లో ఉన్నప్పుడు గెలిపించడానికి ప్రయత్నించడు' అనే విమర్శలు అతనిపై ఉన్నాయి. దీనిలో నిజానిజాలు ఎలావున్నా క్రికెట్‌పై అతనికి ఉన్న అంకిత భావాన్ని ఎవరూ తప్పు పట్టలేరు. "ఇంత గొప్ప ఆటగాడిని ఎలా విమర్శిస్తారో అర్థం కావడం లేదు. దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఉత్తమ క్రికెటర్ సచిన్. ఇతని అంకితభావాన్ని తప్పుపట్టడానికి ఏ ఆధారమూ లేదు" అని స్వయంగా భారత జట్టు కెప్టెన్ సౌరవ్ గంగూలి కితాబిచ్చాడు. సచిన్ విదేశీ పిచ్‌లపై అంతగా రాణించడని గవాస్కర్ కూడా ఒక పత్రికకు రాసిన కాలంలో అభిప్రాయపడ్డాడు. వీటన్నిటికీ సచిన్ మౌనమే సమాధానం అంటున్నాడు. విమర్శలను పట్టించుకోకుండా బ్యాటింగ్‌పై దృష్టి కేంద్రీకరిస్తూ పరుగుల వరద సృష్టించడమే కర్తవ్యంగా భావిస్తున్నాడు. అందుకే విమర్శలు అతనికి వరాలుగా మారి ఒక్కొక్క రికార్డే అధిగమిస్తూ పోతున్నాడు.

భారత జట్టులో ప్రధాన ఆటగాడిగా చాలా కాలంనుండి మన్ననలు పొందిన సచిన్‌కు కెప్టెన్సీ చేదు అనుభవం మిగిల్చింది. 'గొప్ప ఆటగాళ్లంతా గొప్ప కెప్టెన్లు కాలేరు' అనే నానుడిని సచిన్ నిజం చేశాడు. జట్టు విజయం కోసం వ్యక్తిగతంగా ఎంత కష్టపడినప్పటికీ జట్టును గెలుపు దిశగా నడిపించడంలో వెనకబడ్డాడు. దీంతో అతను కెప్టెన్‌గా ఎక్కువకాలం కొనసాగలేకపోయాడు. కానీ ఎవరు కెప్టెన్సీ వహించినా సచిన్ సూచనలు తీసుకోకుండా జట్టును నడిపించలేరు.

స్పాన్సర్‌షిప్ వివాదంలో ఎక్కువ నష్టం సచిన్‌కే

ప్రపంచ క్రికెట్‌ను ఒక్క కుదుపు కుదిపిన స్పాన్సర్‌షిప్ వివాదంలో అత్యధికంగా నష్టపోతున్నది సచిన్ టెండూల్కర్ మాత్రమే. ప్రపంచంలో అతనికి వున్న పేరు ప్రఖ్యాతులను గుర్తించిన బహుళ జాతి సంస్థలు వాణిజ్య ప్రకటనలకు అతన్ని ఎక్కువగా వాడుకోవడానికి పోటీ పడుతున్నాయి. దీంతో చాలా కంపెనీలతో అతను వ్యక్తిగతంగా స్పాన్సర్‌షిప్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. కానీ వ్యక్తిగత స్పాన్సర్‌షిప్‌లను అనుమతించబోమని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కొత్త నిబంధన విధించింది. ఐసిసి ఒప్పందం కుదుర్చుకున్న సంస్థకు సంబంధించిన ప్రకటనల్లోనే ప్రపంచ క్రికెటర్లందరూ పాల్గొనాలి. వ్యక్తిగత స్పాన్సర్లకు చెందిన యాడ్‌లను ప్రతీ మేజర్ టోర్నమెంట్‌కు నెలరోజుల ముందు, టోర్నీ జరిగిన తర్వాత నెల రోజుల వరకూ టెలివిజన్లలో ప్రకటించ కూడదని ఐసిసి నిబంధన విధించింది. దీంతో భారత క్రికెటర్లలో సచిన్‌తో పాటు గంగూలి, ద్రావిడ్, కుంబ్లే, సెహ్వాగ్ ఆర్థికంగా చాలా నష్టపోతారు. ప్రకటనల ద్వారా వారికి వచ్చే ఆదాయం కోట్లలో ఉంది. ✥

మొలకలపల్లి కోటేశ్వరరావు

(గత వారం తరువాయి)



ఫైనాన్సు అప్పు తీర్చలేక భార్యాబిడ్డలతో పరారైన వాళ్ళూ, భార్యాబిడ్డల్ని వాళ్ళ మానాన వాళ్ళని వదిలి పరారైన వాళ్ళూ, ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్న వాళ్ళూ ఆమె ముందు ప్రత్యక్షమయ్యారు.

ఆమె వణికిపోతూ ఒక్కసారిగా పెద్ద పెట్టున రోదించింది.

"ఊరుకోవే... ఏహై ఊరుకో... ఎందుకే ఏడ్చేది నువ్వూ! ఏడవ్వాకవే! ఫైనాన్సు అప్పు చాలా మట్టుకి తీర్చేసాలేవే! రోజూ అర్ధరేతికి దాకా బాడిగలు తోలి తీరుస్తున్నాలేవే! ఏడవ్వాకవే!" అమ్మ ఆ ఆస్పత్రిలో, ఇతర రోగుల మధ్య రోదిస్తుంటే బ్రతిమలాడటం మొదలు పెట్టాడు నరసింహం.

"నా కోసం ఫైనాన్సు అప్పు తీసకొచ్చి... ఆ అప్పు తీర్చడం కోసం నువ్వు అర్ధరేత్రిదాకా రిచ్చాలాగుతున్నావా? రేపునీకేమన్నా జరగరానిది జరిగితే.. వద్దు.. నాకు వైజ్యంవద్దు.. నన్ను ఇంటికి తీసకపో!"

"అదేందే.. జబ్బు తగ్గకుండా ఇంటికి తీసకపొమ్మంటే ఎట్టా? కొద్దిగా తగ్గనీయ్, పోదాం!"

"నాది తగ్గే జబ్బు కాదు. మందులు వాట్టం దండగ! నాది నిలిచే పేణం కాదు. నన్ను గుడిసెకి తీసకపోతావా, సరే! నన్ను ఈ ఆస్పత్రిలో ఇలానే ఉంచితే ఏ అర్ధరాత్రో, అపరాత్రో ఉరి పెట్టుకుని చస్తా!" అంది ఆమె.

అనడమే కాదు, అప్పుడే వచ్చిన కంపౌండర్‌తో ఇంజెక్షన్ చేయించుకోవడానికి నిరాకరించింది.

నిజానికి అప్పటికి నరసింహం వని కూడా అయిపోయింది. బెట్టుగా తల్లిని ఆస్పత్రిలో ఉండమని అన్నాడు కానీ, ఆమె ఇంటికి పోదాం అనడం అతనికి మంచిదే అయింది. అప్పు తెచ్చిన డబ్బు అంతా ఖర్చయిపోయింది. ఇక అతని చేతిలో రూపాయి లేదు. మరుసటి రోజు మందు కొనుక్కురావాలంటే మళ్ళా అప్పు చెయ్యాల్సిందే!

వాన ముసురు! ముసురుకి రిక్షా బేరాలు కూడా సరిగా దొరకడం లేదు!

మూడు రోజులుగా ఫైనాన్స్ బాకీ కట్టలేదు. ఆ బాకీ కట్టాలన్నా తనకి సమస్యే!

అమ్మని ఇంటికి తీసుకుపోవడం తప్ప తనకి మరో మార్గం లేదు.

నాలుగేళ్ళ నించీ పీడిస్తున్న దగ్గు జబ్బు! ఒకనాటికి ఏం తగ్గుతుంది?

డాక్టర్ దగ్గరకి వెళ్ళి తన అశక్తతనీ, తల్లి పరిస్థితినీ చెప్పాడు.

"సరే మీ ఇష్టం! ఆమెకి మాత్రం ప్రమాదమే! మందులు వాడుకుంటూ ఉంటే కొంత ఉపశమనం ఉంటుంది!" అని డాక్టర్ బిల్లు వేసి ఇచ్చాడు.

ఐదు వందల రూపాయలు! అది చిన్న ఆస్పత్రీ, తక్కువ చదువుకున్న డాక్టర్ కాబట్టి అంత తక్కువ బిల్లు!

తన దగ్గిర...

మామూలే! టీ నీళ్ళకి టికాణా లేదు.

ఫైనాన్స్ కంపెనీలో నిన్నా, మొన్నా, ఇవ్వాళా మూడు రోజుల బాకీ చెల్లించాలి.

మొన్నటి 40+2+1, నిన్నటి 40+2, ఇవ్వాల్టి 40 – మొత్తం 125 రూపాయలు చెల్లిస్తే ఆ పీడ ఈ రోజుకి వదిలిపోతుంది.

మళ్ళీ రేపట్నించీ తప్పవు తంటాలు!

నరసింహం ఆలోచించాడు. ఎంత ఆలోచించినా మార్గం కనపడలేదు. మళ్ళా నారాయణ దగ్గరికి వెళ్ళక తప్పదనుకుని వెళ్ళాడు.



ఆస్పత్రిలో కట్టాల్సిన బిల్లు దగ్గర్నించీ తన గోడు అంతా వెళ్లబోసుకున్నాడు.

నారాయణకి కావాల్సింది కమీషనే!

"సరే ఏం చేద్దాం, అవసరం అంటుంటివీ! నీకు మరో ఫైనాన్సు కంపెనీలో అప్పు ఇప్పిస్తా! అయితే ఇంతకుముందు ఇక్కడ తీసుకున్నట్టు ఎవరితోటీ అనవాకు! మళ్ళా నాకు మాట వచ్చిద్దీ, ఉన్న పరపతి పోయిద్దీ!"

"నేను ఎవురి తోటయినా ఎందుకు అంటాను?"

ఇద్దరూ 'జనప్రియ జనరల్ ఫైనాన్షియర్స్' అనే మరో షాపుకి వెళ్ళారు.

రాతకోతలూ, హామీ సంతకాలూ అయిపోయిన తరువాత నరసింహం చేతికి వెయ్యి అప్పుకి 690 వచ్చాయి.

'ఫైనాన్సోడికి నిన్నా మొన్నటి బాకీ కట్టకపోతే ఇంటి మీదకి వచ్చి గొడవ చేస్తాడు. ఎంతోకొంత కట్టి రావటం మంచిది!' అనుకుని మణికంఠ ఫైనాన్సుకు వెళ్ళి 85 రూపాయలు కట్టాడు. ఆ రోజు బాకీ మరునటి రోజు పెనాల్టీతో కడతానన్నాడు.

డాక్టర్ కాళ్ళూ గడ్డాలూ పట్టుకుని బ్రతిమాలి ఐదు వందలకి నాలుగు వందలు ఇచ్చాడు. మిగతా వాళ్ళకి 50 ఇచ్చాడు. పండ్లుకొని తల్లినీ, భార్యనీ రిక్షాలో కూర్చో పెట్టుకుని ఇంటికి వచ్చాడు నరసింహం.

★ ★ ★

వారం రోజులు గడిచాయి. నాలుగు రోజుల బాకీ కట్టలేదు నరసింహం.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. రెండు మోటారు సైకిళ్ల మీసుకుని నలుగురు వచ్చారు నరసింహం కోసం.

బాకీదారులు పనులకి వెళ్ళకముందే ఉదయాన్నే వసూళ్ళకి రావడం ఫైనాన్సు వాళ్ళ నిత్య కార్యక్రమం. ప్రతిరోజూ ఉదయం బాకీ కిస్తీ కట్టని వాళ్ళ ఇళ్ళకివెళ్ళి వార్నింగ్ ఇచ్చి రావడం వాళ్ళ డ్యూటీ! వీళ్ళు ఎక్కువగా అప్పులు ఇచ్చేది కూలీనాలీ చేసుకునే పేద ప్రజలకే!

ఆ రోజు బాగా కష్టపడి, ఎక్కువ బాడుగతోలి, రెండు ఫైనాన్సు షాపుల్లోనూ ఎంతోకొంత బాకీ కట్టాలనుకున్నాడు నరసింహం.

బాగా వేకువనే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, చద్దన్నం తిని, టౌనులోనికి వెళ్ళడానికి తయారై రిక్షా తుడుచుకుంటున్నాడు.

"ఏరా నరసిమ్మా! నాలుగు రోజుల నించీ కిస్తీలు కట్టకుండా తిరుగుతున్నావు. వళ్ళు బలిసిందేమిరా నా కొడకా! తీసుకునేటప్పుడు వున్న తెలివి ఇచ్చేటప్పుడు కూడా వుండాల్రా! నీ ఇష్టం, ఏమనుకుంటున్నావో! నువ్వూ, నీ గుడిసె, పెళ్ళాం బిడ్డలూ ఎవరూ మిగలరు, ఏం ఉండవు! మర్యాదగా ఈ నాల్రోజుల కిస్తీ ఇవ్వాళ కడతావా సరే, లేకపోతే నీకు రేపు పెళ్ళే!"

"అయ్యయ్యా.... ఇయ్యాల సందకాడికి తెచ్చి కడతానయ్యా! నా

...రువు తీయవాకండయ్యా! సచ్చి మీ కడుపున పుడతానయ్యా!" బ్రతిమలాడాదు నరసింహం.

"నీలాంటి పనికిమాలిన నా కొడుకులు మా కడుపున ఎందుకు లేరా పుట్టడం! నీ ఇష్టం, సాయంత్రానికి కానీ బాకీ కట్టకపోయావంటే ఈసారి వచ్చినప్పుడు ఎవరు అడ్డం వచ్చినా ఆగే పని లేదు. నీ తాట వలుస్తాం!"

ఎంత వేగంగా వచ్చారో హెచ్చరించీ, బెదిరించీ అంతే వేగంగా వెళ్ళిపోయారు ఇతర బాకీదారుల ఇళ్ళకి ఇలాగే బెదిరించడానికి!

ఆ రోజు పొద్దు పొడవకముందు నించీ, పొద్దు గుంకే వరకూ, రాత్రి వరకూ నరసింహం క్షణం కూర్చోకుండా రిక్షా తొక్కాడు. ఒక్క బేరం కూడా పోగొట్టుకోలేదు. ఒక్క నిమిషం కూడా ఊరికే కూర్చోలేదు.

రెండు ఫైనాన్స్ షాపుల్లో బాకీ కొంత అయినా జమ చేయాలనే పట్టుదలతో రిక్షా తొక్కాడు.

రాత్రి 8 గంటలకి 156 రూపాయలు వచ్చాయి.

మొదటి ఫైనాన్స్ షాపులోనికి వెళ్ళాడు. అప్పటికి 5 రోజుల బాకీ చెల్లించాలి.

40+6, 40+5, 40+4 ఇలా మొదటి రోజుకి 2, తరువాత రోజునించీ ఇక రోజుకి రూపాయి చొప్పున 220 అయ్యాయి.

వడ్డీకి వడ్డీ పెరిగింది.

"పొద్దుట్నించీ రెండు కాళ్ళు ఒక చోట పెట్టకుండా, జాము సేపు కూర్చోకుండా రిక్షాలాగానుసామీ! పెళ్ళాం పిల్లలు పస్తుంటారు సామీ! మొదటి రెండు రోజుల బాకీ తీసుకోండి" అని వాళ్ళ కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమలాడి, మొదటి రెండు రోజుల బాకీ + పెనాల్టీ 13 చెల్లించాడు.

రెండో ఫైనాన్స్ షాపుకి వెళ్ళి 36 చెల్లించాడు.

తను ఎంత చెల్లించినా ఇంకా వడ్డీకి వడ్డీ పెరిగి పోతూనే ఉంది. పెనాల్టీ తడిసి మోపెడవుతోంది.

పొరపాటున ఒక రోజు కట్టకపోతే మరుసటి రోజు అదనంగా రెండు రూపాయలు కట్టాలి. అమ్మో... కనపడకుండానే చాలా ఎక్కువ అవుతుందే అనుకున్నాడు నరసింహం.

నిజానికి ప్రపంచంలో ఏదీ కూడా వడ్డీ అంత వేగంగా పరిగెత్తలేదు, పెరగలేదు!

వడ్డీకి ప్రతి దినమూ శుభదినమే!

ప్రతి ఉదయం శుభోదయమే!

క్షణక్షణమూ ఆనందవీక్షణమే!

వడ్డీకి పెరగడం, పెరగడం, పెరగడం తప్ప తరగడం అనే సమస్య లేదు.

ప్రతిక్షణం వడ్డీ పెరుగుదలనే సూచిస్తుంది కానీ తరుగుదలని ఎన్నటికీ సూచించదు.

వానా వరదా, పగలూ రేయీ, కష్టం నష్టం ఏవీ దానికి ఉండవు!

పెరగడమే వడ్డీ పని!

గడియారంలో ముళ్ళు తొందర తొందరగా తిరగడమే వడ్డీకి కావాల్సింది.

ఎలాంటి పరిస్థితిలో కూడా పెనాల్టీ పడకుండా, ఏరోజుబాకీఆ రోజు చెల్లువేస్తేనే తను ఈ ఫైనాన్సు కోరల నించి బయటపడగలడు! ఇలా రోజూ పెనాల్టీలు కడుతూ పోతూ ఉంటే తను జీవితంలో ఎప్పటికీ ఈ బాకీ తీర్చడం జరిగే పని కాదు.

మూడు రోజుల్నించీ ఉన్న పాత బకాయిల్ని రద్దు చేసి, బాకీ తీరేవరకూ ఈ రోజు కిస్తీ ఆ రోజు చెల్లించాలని గట్టిగా అనుకున్నాడు.

★ ★ ★

నరసింహం అమ్మకి మందులు అయిపోయి రెండురోజులు అయింది.

ఆస్పత్రిలో బిల్లు కట్టడానికి మరో ఫైనాన్సు కంపెనీలో పది వందలు అప్పు తెచ్చానని భార్య సరోజినికి చెబుతుంటే ఆమె విన్నది.

ఇంట్లో తిండి పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది.

తనూ, కోడలూ, ముగ్గురు బిడ్డలూ అందరూ ఒక్కరి సంపాదన మీదా, ఒక్కరి రెక్కల కష్టం మీదా ఆధారపడి బ్రతకాలి.

తను ఇంతకుముందు మాదిరిగా పని చేయలేదు.

తనకి ఇది ఇంకా ముదిరే జబ్బు కానీ తగ్గే జబ్బు కాదు. కొడుక్కి తను ఇంకా భారం కావడమే తప్ప ఉపయోగం లేదు.

తను బ్రతికి ఉంటే.. మళ్ళీ మందులకీ.. మళ్ళీ ఆసుపత్రికీ.. మళ్ళీ ఖర్చుకీ.. మళ్ళీ ఫైనాన్సు వాడి చెంతకీ తప్ప మరో సుఖంలేదు.

కొడుకు రెండు ఫైనాన్సు షాపుల్లో తెచ్చిన బాకీ రోజూ వాయిదాలు కట్టలేదు. రేపు వాళ్ళు ఇంటి మీదకి వచ్చి ఏమైనా చేయవచ్చు.

ఇవ్వాళ హెచ్చరించి పోయారు. రేపునిజంగా వాళ్ళు అనుకున్నది చేస్తారు! తను చూడలేదు.

తను ఇక బ్రతికి ఉండటం వ్యర్థం!

నిశ్చయించుకుంది కనకమ్మ.

ఆ రోజు మధ్యాహ్నం ఒక ముసలి మనిషి ఎలుకల మందు సంచిలో పెట్టుకుని కేకలు పెడుతూ అమ్ముతున్నాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. కనకమ్మ బేరం చేసి పది ప్యాకెట్లు కొనుక్కున్నది.

మరుసటి రోజు మధ్యాహ్నం ఆ మందు మొత్తం నీళ్ళలో కలుపుకుని తాగి ప్రశాంతంగా తనువు చాలించింది.

తల్లి కర్మకాండల కోసం నరసింహం మళ్ళీ అప్పు చేయక తప్పలేదు.

ఈ మధ్య ఆ వాడలోనే ఒకతను నరసింహానికి పరిచయం అయ్యాడు. అతను 25 రూపాయల వడ్డీకి కావాలంటే అప్పు ఇప్పిస్తానని నరసింహానికి చెప్పాడు.

అతని దగ్గరికి వెళ్లాడు నరసింహం.

అతను ఒక ఫైనాన్సు కంపెనీకి తీసుకుపోయి 2 వేల రూపాయలు అప్పు ఇప్పించాడు.

వాళ్ళు మొదటి నెల వడ్డీ ఐదు వందలు చెల్లుపెట్టుకుని 15 వందలు ఇచ్చారు.

ఆ డబ్బుతో నరసింహం తల్లి కర్మకాండల్ని చేసాడు.

తల్లి మరణం అతన్ని బాగా కృశింప చేసింది.

తన అసమర్థత, డబ్బు సంపాయించి సుఖంగా పోషించలేని కారణంగానే తల్లి మరణించిందని ఎంతో కలత చెందాడు.

సరిగా రిక్షా కూడా లాగలేకపోతున్నాడు. మనిషిలో దిగులు, నిరాశ, భయం ఏర్పడి పని చేయాలనే కోరిక సన్నగిల్లిపోయింది.

20 రోజులు గడిచిపోయాయి.

ఇంతై, అంతై, వటుడింతై అన్నట్లుగా ఫైనాన్సు భూతం కొండ చిలువలా పెరిగిపోయింది. వడ్డీకాదు, వడ్డీకి వడ్డీ బాగా పెరిగింది.

మోటారు సైకిళ్ళు వేసుకుని ఒక రోజు పొద్దునే వచ్చారు.

"ఏరా... దొంగ ల... కొడకా...'

"అయ్యా... రెండు రోజులు గడువియ్యండయ్యా! మీ బాకీ తీరుస్తానయ్యా!"

"రెండు రోజులు ఆగితే ఎక్కడ్నించి 'వస్తయ్యిరా డబ్బులూ? ఎట్ట తీరుస్తావు?"

"ఎట్టోకట్ట తీరుస్తాగా సామీ! మీ కాళ్ళకి దణ్ణం బెడతాను సామీ! నేను బాకీ తీర్చేవోడ్నే కానీ, ఎగేసే వోడ్ని కాదు సామీ!"

"అందరూ తీర్చే వాళ్లేరా, ఎగేసేవాళ్ళు ఎవరూ ఉండరు. బాకీ తీర్చాలంటే డబ్బు వచ్చే దారి ఉండాలి కదా! సరే నీ ఇష్టం! వారం రోజులు గడువు ఇస్తున్నాం. ఈ వారంలో బాకీ తీర్చావా సరే! వారం దాటితే మాత్రం నీకు మూడిందే!"

మూడు ఫైనాన్సు కంపెనీవాళ్ళు ఇలాగే గడువు ఇచ్చి, హెచ్చరించి వెళ్ళిపోయారు.

రెక్కలు తప్ప మరో ఆధారం లేదు నరసింహానికి.

ఇరవై నాలుగ్గంటలూ రెక్కలు ముక్కలు చేసుకున్నా, నిద్రాహారాలు మాని రిక్షా తొక్కినా మూడు ఫైనాన్సు కంపెనీల్లోని బాకీ తీర్చడం జరిగే పని కాదు.

కనీసం పెనాల్టీని రద్దు చేసుకోమని అడిగినా వాళ్ళు రద్దు చేసే మనుషులు కాదు.

ఒకవైపు తల్లిపోయిన బాధ....

మరోవైపు మింగడానికి సిద్ధంగా కాచుకు కూచున్న ఫైనాన్స్ మహారాక్షసి!

"ఈసారి వాళ్ళు ఇంటి మీదకి వస్తే పట్టుకుని కొడతారే! నా పేణం తీస్తారు! బతకనియ్యరే! నేను కోడికూయకముందే లేచి రిక్షా వేసుకుని టౌనులోనికి పోతా! నువ్వు కూడా పనిచేసే వాళ్ళ ఇంటికి పో! పిల్లల్నేం చేస్తారు, నాలుగు తిట్టిపోతారు!" అని నరసింహం భార్యకి చెప్పాడు.

ఫైనాన్స్ వాళ్ళ దెబ్బకి భయపడి నరసింహం వేకువనే లేచి టౌనులోనికి వెళ్లిపోతున్నాడు. అర్ధరాత్రి వరకూ ఎక్కడెక్కడో తిరుగుతాడు! ఎప్పుడో ఒక జామున వచ్చి అలా పడుకుని ఇలా వెళ్ళిపోతాడు.

ఒక్కో రోజు ఇంటికి కూడా రాడు. రాత్రిపూట ఏ సందులోనో, గొందిలోనో రిక్షా ఆపి, దాని మీదనే పడుకుని నిద్రపోతాడు.

సరిగా తిండిలేదు. నిద్రలేదు.

ఫైనాన్సు వాళ్ళకి కనపడకుండా తిరుగుతున్నాడు.

నరసింహం గుడిసె చుట్టూ ఫైనాన్సు వాళ్ళు తిరుగుతున్నారు. ఒకరోజు వాళ్ళు వచ్చినప్పుడు సరోజిని ఉంది.

"ఏమే.. లం...కొడుకు వీడు బాకీ కట్టకుండా ఎన్ని రోజులు ఇట్ట తప్పిచ్చుకుని

తిరుగుతాడు? మాకు చిక్కకుండా ఎక్కడికి పోతాడు? ఇప్పుడు కాకపోతే ఇంక పదిరోజులకైనా దొరకడా? దొరికిన తరువాత అంతు చూడకుండా వదుల్తామా? ఒకరికొకరికి తెలియకుండా మూడు చోట్ల ఫైనాన్సు తీసుకుంటాడా? చూస్తాం. వాడి అంతు తేలుస్తాం. ఫైనాన్సు అంటే అల్లాటప్పా విషయం అనుకుంటున్నాడేమో!" సరోజినికి చెప్పి, హెచ్చరించి వెళ్ళిపోయారు.

ఆ రోజు రాత్రి 7 గంటల సమయంలో కరంటు లేదు. చీకటిగా ఉంది. రిక్షా బేరం వస్తే, చీకట్లో కనపడను కదా అని నరసింహం దత్తమణి కంత ఫైనాన్సు మీదుగా రిక్షా వేసుకుని వెళ్తున్నాడు. అనుకోకుండా కరెంట్ వచ్చింది. ఆ షాపు వాళ్ళు అప్పుడే బయట నిలబడి ఉన్నారు.

వాళ్ళ కంటిలో నరసింహం పడ్డాడు. పట్టుకున్నారు.

రూంలో పడేసి షట్టర్లు దింపేసారు. అది వాళ్ళకి అలవాటే!

ఫైనాన్స్ వాళ్ళ ఆగడాలకు అంతు ఉండదు.

పూర్వం ఉసురి ఉండేది. అది వడ్డీయే!

చాలా దుర్మార్గంగా ప్రజల రక్త మాంసాల్ని పీల్చేది ఉసురి!

ప్రజల్ని బానిసలుగా కట్టి పడేసింది ఉసురి. కొన్ని కుటుంబాల్ని కొన్ని తరాల పాటు భూస్వామ్య వర్గానికి వెట్టి చాకిరీ చేయించిందీ ఉసురి! అలాంటి ఉసురి ఈ ఫైనాన్స్!

ఫైనాన్స్ వాళ్ళు ఒక వ్యక్తి తీసుకున్న బాకీ ఇవ్వలేదని కత్తితో పొడిచారు! మరో వ్యక్తి గుడిసె తగలబెట్టారు!

పోలీసులకి వెళ్ళి చెప్పుకున్నా ప్రయోజనం ఉండదు. పోలీసుల్లో చాలా మందికి ఫైనాన్స్ వ్యాపారంలో భాగాలు ఉన్నాయి. అంతేకాక నెలనెలా మామూళ్ళు కూడా వాళ్ళకి అందుతుంటాయి.

ఫైనాన్స్ వాళ్ళు కొట్టి దౌర్జన్యం చేసారని ఎవరైనా తెలియక పోలీసులకి పోయి రిపోర్ట్ చేస్తే..

"అరెలం... కొడకా! తీసుకున్న బాకీ తిరిగి తీర్చే పనిలేదురా! వాళ్ళ దగ్గిర అప్పులు తీసుకుని పందులు తిన్నట్టు తినేటప్పుడు తెలియదా తిరిగి కట్టాలని! వాడికి బాకీ కట్టకపోతే తన్నక ఏం చేస్తాడ్రా! ఇంకా నాలుగు తంతే బాగుండేదిరా!" అని పోలీసులు కూడా అదనంగా మరో రెండు కొడతారు.

పోలీసుల విషయం తెలిసే ఎవరూ ఫైనాన్స్ వాళ్ళ మీద ఫిర్యాదు చేయరు.

రూం లోపల నరసింహాన్ని ఏడుపులు బయటికి రాకుండా లాఠీల వంటి కర్రలతో కొట్టడం మొదలు పెట్టారు.

'ఏరా... తీసుకునేటప్పుడు అయ్యా, అమ్మా అని కాళ్ళూ గడ్డాలు పట్టుకుని తీసుకుంటారూ.... తిరిగి ఇవ్వాల్సి వచ్చినప్పుడు తప్పించుకుని తిరుగుతారూ! ఎన్ని రోజులు కనవడకుండా ఇట్టతప్పిచ్చుకుని తిరుగుతావురా?" అనిబూతులు తిడుతూ కొట్టారు.

నరసింహం ఏడ్చినా, దణ్ణం పెట్టినా, కాళ్ళూ గడ్డాలూ పట్టుకుని వేడుకున్నా వాళ్ళు ఏ మాత్రం జాలీ, దయా లేకుండా నిర్దాక్షిణ్యంగా, దారుణంగా కొట్టారు. సున్నితమైన ప్రదేశంలో కనపడని దెబ్బలు కొట్టారు.

నరసింహం ఏడుస్తూ, అతి కష్టం మీద రిక్షా తొక్కుకుని గుడిసెకి వచ్చి మంచం మీద పడిపోయాడు.

రాత్రి పదిగంటల సమయంలో మరో ఫైనాన్స్ కంపెనీ వాళ్ళు వచ్చి పడ్డారు.

ఏరా దొంగనాకొడకా! దొంగ వేషాలు వేస్తున్నా! పది రోజుల్నించీ ఇంటి చుట్టూ తిరుగుతుంటే మాకు కనపడకుండా దాక్కుని తిరుగుతావు? డబ్బు తీసుకున్నప్పుడు కట్టాలని తెలియదా? ఇప్పుడు దొంగ ఏడుపులు ఏడ్చీ, నంగనాచి వేషాలు వేస్తే ఏం లాభం? మా డబ్బు కడతావా? చస్తావా?" అని వాళ్ళు కూడా తమవంతు ప్రయత్నంగా సైకిల్ చైన్లతో కొట్టారు. ఇంటికి చాలాసార్లు తిప్పించుకున్నందుకు కసితీరా కొట్టారు.

ఆ రోజు రాత్రి నరసింహానికి నిద్రలేదు. గాయాలతో, శరీరం అంతా నొప్పులతో తెల్లవార్లూ ఏడుస్తూ, మూలుగుతూనే ఉన్నాడు.

తెల్లవారడమే ఆలస్యం, మూడో ఫైనాన్స్ రౌడీలు మూడు మోటార్ సైకిళ్ళమీద వచ్చి పడ్డారు. అప్పటికి ఇరుగు పొరుగు జనం ఇంకా నిద్ర కూడా లేవలేదు.



భర్త గాయాలని సరోజిని వేడినీళ్ళ కాపడం పెడ్తూ, తెల్లవార్లూ మేలుకుని, అప్పుడే కళ్ళు మూసుకుంది.

"ఏరా లం...కొడకా... పది రోజుల్నించీ తిరుగుతుంటే ఇయ్యాల దొరికా! తప్పిచ్చుకుని ఎన్ని రోజులు తిరుగుతా ఇట్టా?"

వాళ్ళమాటలకి సరోజిని ఉలిక్కిపడి లేచింది. వాళ్ళని చూసి భయంతో గజగజా వణికిపోయింది.

"మా ఆయన్ని ఏం చేయొద్దు సామీ... మీ బాకీ తీరుస్తాం సామీ.. మీకు దణ్ణం బెడతాను సామీ... పిల్లలు గల వాళ్ళం సామీ..." అని ఏడుస్తూ వెళ్ళి వాళ్ళ కాళ్ళు పట్టుకుంది.

"ఏందే నీయమ్మ... కాళ్ళు పట్టుకుంటావేందే? నీ మొగుడి కాళ్ళు పట్టుకుని మా బాకీ రద్దు చేయమని చెప్పు! మా బాకీ రద్దు అయితే వాడి వంటి మీద చేయి పడితే అప్పుడు అడుగు!"

"తీరుస్తాం సామీ!"

"ఎప్పుడే తీర్చేదీ? వాడూ, నువ్వూ ఇద్దరూ గుడిసెలో లేకుండా తప్పించుకుని తిరిగారు కదే! మేం ఎన్నిసార్లు తిరగాలే మీ గుడిసెల చుట్టూ, మీరు ఇచ్చే లక్షలకి! మీరు ఇచ్చే వడ్డీ మా పెట్రోలు ఖర్చులకి రాదే! తన్నులు పడితేనే మీరు డబ్బులు కట్టేదీ! మూడుచోట్ల ఫైనాన్సు తెస్తారూ? ఇట్ట ఎవుర్ని మోసం చేద్దామనీ, ఎంతకాలం చేద్దామనీ..."

"గొంతు మీదకి వచ్చి తెచ్చుకున్నాం సామీ!"

"ఆ ఎవారం మాకు చెప్పవాకవే! మాకు కట్టాల్సిన డబ్బు ఇప్పుడు కట్టండి!"

"ఇప్పటికిప్పుడు కట్టమంటే ఎక్కడ తెచ్చి కడతాంసామీ!"

"మీరు ఇట్టకట్టర్లే! నాలుగు తంతేకానీ మీరు దారికి రారు! తన్నులు పడితేనే మీరు డబ్బులు కట్టేది!" అని బెల్టులతో నరసింహం మీద పడ్డారు.

నిన్నటి దెబ్బలకే భయంకరంగా మూలుగుతూ బాధతో విలవిలలాడిపోతున్న నరసింహాన్ని వీళ్ళు ఇంకా దారుణంగా కొట్టారు. గోరుచుట్టు మీద రోకటి పోటులా వాళ్ళ దెబ్బలు తగిలాయి.

"రెండు రోజులు గడువు ఇస్తున్నాం. ఈ గడువులోపు కట్టకపోయారంటే మీ ఊపిరి తీస్తాం!" కొట్టీ కొట్టీ అలసిపోయి, చివరి మాటగా చెప్పి వెళ్ళిపోయారు.

రెండు రోజుల గడువు కాదు, వాళ్ళు అటు వెళ్ళిన రెండు గంటలకే అందరి దెబ్బలకీ నరసింహం ప్రాణాలు విడిచాడు.

నరసింహం మరణంతో ఆ వాడలోని ప్రజలందరూ మేల్కొన్నారు. ఆగ్రహోదగ్రులయ్యారు.

ఫైనాన్స్ వాళ్ళ దెబ్బలకీ, వాళ్ళ దౌర్జన్యాలకీ మరణించిన వాళ్ళలో నరసింహం మూడోవాడు.

వాడలోని ప్రజలందరూ ఒక్కటయ్యారు.

ఫైనాన్స్ రక్కసిని తరిమి కొట్టడానికీ, ఉరిలాంటి ఉసురికీ వ్యతిరేకంగా వాడలోని జనావళి పిడికిళ్ళు బిగించి కదిలింది.